www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

మంగళవారం 29 - 7 - 2025 | సంపుటి : 1 | సంచిక : 24 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్





## తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిలు

నియమించేందుకు సుప్రీంకోర్టు

### కొలీజియం సిఫారసు

ఆమోదముద్ర వేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**విశ్వంభర, ఢిల్లీ:** దేశంలోని పలు హైకోర్టులకు 19మంది జడ్జిలు/అదనపు జడ్జిలు నియమితులయ్యారు. పలువురు న్యాయవాదులు, జ్యుడీషియల్ ఆఫీసర్లను జడ్జిలు/అదనపు జడ్జిలుగా నియమించేందుకు సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ప్రకటించారు. మొత్తం 19 మందిలో తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. వీరిలో గౌస్ మీరా మొహియుద్దీన్, చలపతిరావు సుద్దాల అలియాస్ ఎస్.చలపతిరావు, వాకిటి రామకృష్ణా రెడ్డి, గడి ప్రవీణ్ కుమార్ ఉన్నారు. వీరితో మధ్యప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు జడ్జిలు, నలుగురు అదనపు జడ్జిలు నియమితులు కాగా.. గువాహటి హైకోర్టుకు నలుగురు అదనపు జడ్జిలను నియమించినట్లు పేర్కొన్నారు.




## హైడ్రాకు రూ. 25 కోట్లు కేటాయింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విశ్వంభర, హైదరాబాద్:

హైడ్రాకు తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ డిజాస్టర్ రిస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 25 కోట్లు కేటాయిం చింది. ఈ నిధులు హైదరాబాద్ మహానగర ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించడం, చెరువులు, కుంటలు, నీటి వనరుల పరిరక్షణ, వరదల నిర్వహణ, నగర విపత్తు నిర్వహణ కార్యకలాపాల కోసం ఉపయోగించనున్నారు. ఈమేరకు హైడ్రా కమిషనర్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పేరిట ఉత్తర్వులు విడుదల అయ్యాయి.



2లో...

# రిజర్వేషన్ల సాధనకు చిత్తశుద్ధితో ఉన్నాం...

- ఈ విషయంలో అన్ని పార్టీలు సహకరించాలి
- ఆగస్టు 5, 6, 7 తేదీల్లో బిసి ప్రతినిధులతో ఢిల్లీకి..
- రాష్ట్రపతిని నేరుగా కలిసి విజ్ఞప్తి చేయాలని కేబినెట్ నిర్ణయం
- మీడియా సమావేశంలో పొన్నం, సురేఖ, శ్రీహరి
- తెలంగాణ కేబినెట్ సమావేశంలో 25 అంశాలపై చర్చ
- అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల రద్దుకు గ్రీన్ సిగ్నల్
- వాహనాల మానిటరింగ్‌లో ఆధునిక సాంకేతికత వినియోగం
- మైక్రో బ్రూవరీస్‌కు కేబినెట్ ఆమోదం...

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో సోమవారం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం 25 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థలు అలాగే, విద్య, ఉద్యోగాల కల్పనలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులకు వెంటనే చట్ట బద్ధత కల్పించాలని రాష్ట్ర మంత్రిమండలి రాష్ట్రపతిని విజ్ఞప్తి చేసింది.



## ఈ నెల 31న ప్రభుత్వానికి కాళేశ్వరం నివేదిక

సమర్పించేందుకు సిద్ధమవుతున్న ఘోష్ కమిషన్

న్యాయపరంగా ఇబ్బందులు తలెత్తకుండా రిపోర్ట్‌ను పరిశీలిస్తున్న పీసీ ఘోష్

**విశ్వంభర, హైదరాబాద్:** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటు, అవకతవకలపై న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ తుది అంకానికి చేరుకుంది. ఈ విచారణకు సంబంధించిన తుది నివేదిక ప్రభుత్వానికి సమర్పించేందుకు పీసీ ఘోష్ కమిషన్ సర్వం సిద్ధం చేసుకుంటోంది. ఈ నెల 31న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పదవీ కాలం ముగియనుంది. దాంతో అదే రోజున పీసీ ఘోష్ కమిషన్ వద్ద నుంచి తుది రిపోర్ట్ ను ఇరిగేషన్ శాఖ తీసుకోనుంది. నిన్నే కోల్ కతా నుంచి హైదరాబాద్ చేరుకున్న కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్..

ప్రభుత్వానికి తుది నివేదిక ఇచ్చే ముందు లీగల్ అంశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. న్యాయపరంగా ఎటువంటి ఇబ్బం దులు తలెత్తకుండా ఫైనల్ రిపోర్ట్ ను పీసీ ఘోష్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

## 'చినార్ కోర్' ధైర్యసాహసాలు నిరుపమానం

'ఆపరేషన్ మహాదేవ్'లో శౌర్య పరాక్రమాలు ప్రదర్శించారు

ఉగ్రవాదులను తుదముట్టించేందుకు ప్రాణాలకు తెగించి పోరాడారు

లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్



2లో...

## 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం

పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య...

- మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారు
- ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ 22 నిమిషాల్లో పూర్తి చేశారు
- అంతకుముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు
- పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారు
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



2లో...

## బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనకు కలిసి రావాలి

బీజేపీ నేతలు శాసనసభలో ఆమోదం తెలిపి.. ఢిల్లీలో అడ్డుకుంటున్నారు

ఈడబ్ల్యూఎస్‌కు అడ్డురాని 50శాతం కోటా బీసీల విషయంలో ఎందుకువస్తుంది?

\- మంత్రి పొన్నం ప్రభాకర్

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

45 శాతం సీట్లు వారికి కేటాయిస్తాం

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక ప్రకటన

2లో...

## ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

ఆదాయం కోసం ప్రభుత్వం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నది

ప్రగతి బాట పట్టిన రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారు

బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2లో...



## స్థానిక సంస్థల్లో వైశ్యుల వాటా తేలాల్సిందే..

- ఈ డబ్ల్యూ ఎస్‌లో వర్గీకరణ తేవాలి
- నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలి
- రణభేరిని విజయవంతం చేయాలి
- డా. కాచం సత్యనారాయణ గుప్త
- మిర్యాలగూడ రైస్ మిల్లర్ల అసోసియేషన్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైశ్య రాజకీయ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

2లో...

## 'చినార్ కోర్' ధైర్యసాహసాలు నిరుపమానం

మొదటిపేజీ తరువాయి...




**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** జమ్మూకశ్మీర్‌లో సోమవారం జరిగిన 'ఆపరేషన్ మహాదేవ్'లో శౌర్య పరాక్రమాలు ప్రదర్శించిన చినార్ కోర్ (మిలటరీ యూనిట్)ను డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ అభినందించారు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు ప్రాణాలకు తెగించిన వారి పోరాట పటిమ నిరుపమానమన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పె ట్టారు. శ్రీనగర్‌లో చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే. వారిలో పహల్గాం ఉగ్రదాడి వ్యూహకర్త సులేమాన్ షా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు చేపట్టినప్పుడు భద్రతా బలగాలు ఎదుర్కొనే కఠిన సవాళ్లను ఈ సందర్భంగా రాజీవ్ ఘాయ్ ప్రస్తావించారు. " కొన్నిసార్లు పరిస్థితులు శత్రువులకు అనుకూలంగా మారుతాయి. అలాగని, వెనకడుగు వేయలేం. ప్రాణాలకు తెగించి పోరాడాల్సి వస్తుంది. ఈ విషయంలో చినార్ కోర్ ధైర్యసాహసాలు అమోఘం. ఉగ్రవాదులను మట్టికరిపిస్తుందని వీళ్లకు వీళ్లే సాటి అని ఎప్పటికి మర్చిపోవద్దు. భారత సైన్యంలోని పరాక్రమయోధులకు సెల్యూట్" అంటూ రాసుకొచ్చారు. హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజులుగా సైన్యం, పోలీసు బలగాలు గాలింపు కొనసాగించాయి. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పక డ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలిలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. సోమవారం చాలా బృందాలను సైన్యం ఆ ప్రదేశాలకు తరలించింది. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందం ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించింది. ముష్కర మూక షాక్ నుంచి కోలుకొనేలోపే శరవేగంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది.

# రిజర్వేషన్ల సాధనకు చిత్తశుద్ధితో ఉన్నాం

## ఈ విషయంలో అన్ని పార్టీలు సహకరించాలి



మొదటిపేజీ తరువాయి...

ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు ఆగస్టు 5,6,7 తేదీల్లో ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత మార్చి నెలలో శాసనసభలో ఆమోదించిన రెండు బిల్లులు గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు సమీపిస్తుండగా, ప్రస్తుతం బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న ఈ నేపథ్యంలో... ఆగస్టు 5, 6, 7 తేదీల్లో నేరుగా కలిసి విజ్ఞప్తి చేయడానికి వీలుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మ అపాయింట్‌మెంట్ కోరాలని కేబినెట్ నిర్ణయించింది. రిజర్వేషన్ల సాధన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఈ విషయంలో అన్ని పార్టీలు సహకరించాలని మంత్రిమండలి కోరింది. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రిమండలి నిర్ణయాలను మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి మీడియా సమావేశంలో వివరించారు.

కేబినెట్ సమావేశంలో రవాణా, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి విభాగాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. రవాణా శాఖకు సంబంధించిన ముఖ్య నిర్ణయంగా, రాష్ట్ర సరిహద్దుల్లో ప్రస్తుతం ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను రద్దు చేయాలని కేబినెట్ తేల్చింది. ప్రస్తుతం తెలంగాణ సరిహద్దుల్లో మొత్తం 15 చెక్ పోస్టులు ఉన్నాయి. జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా అన్ని రాష్ట్రాలకు చెక్ పోస్టులను తొలగించాలన్న సూచనలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చింది.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా చెక్ పోస్టులను తొలగించాలని నిర్ణయం తీసుకుంది. ఇకపై వాహనాలను పరిశీలించేందుకు చెక్ పోస్టు సిబ్బందిని ఉంచడం కాకుండా, ఆధునిక 'వాహన్' సాఫ్ట్‌వేర్, అడ్వాన్స్ సీసీ కెమెరాల ద్వారా మానిటరింగ్ కొనసాగించనుంది. అదేవిధంగా, రాష్ట్ర పట్టణాభివృద్ధి రంగానికి సంబంధించిన ముఖ్య నిర్ణయం తీసుకుంది. కోర్ తెలంగాణ అర్బన్ సిటీ ఏరియాతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో మైక్రో బ్రూవరీస్ చట్టంలో అవసరమైన సవరణలు చేసి త్వరలో అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.

కేబినెట్ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలు రాష్ట్ర రవాణా రంగంలో సులభతరం , ఆధునీకరణ దిశగా ముందడుగుగా భావించబడుతున్నాయి. అదే సమయంలో మైక్రో బ్రూవరీస్ ఏర్పాటుతో పట్టణాలలో వినోదం, పర్యాటక రంగాలకు కొత్త ఉత్సాహం కలిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# 100కి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాం

### - రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌ను వణికించిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో వాడీవేడి చర్చ మొదలైంది. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ (మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. "మే 7 రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయి. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపారు. మన సైనికులు ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశారు. సిందూర్ అనేది వీరత్వానికి, శౌర్యానికి ప్రతీక. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సైన్యానికి అభినందనలు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత.

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ సైన్యం మనపై దాడికి దిగింది. దాయాది దాడులను సమర్థంగా తిప్పికొట్టాం. మన సైనికులు మిసైళ్లతో విరుచుకుపడ్డారు. పాకిస్థాన్‌లోని మిసైల్ లాంచింగ్ స్టేషన్ ధ్వంసమైంది. శత్రువుల దాడులను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది. ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా సైనికులు దాడులు జరిపారు. ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం. భారత దాడులను అనేక దేశాలు సమర్థించాయి. సరిహద్దులు దాటి వెళ్లడం.. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం కాదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే సంస్థలను ధ్వంసం చేయడమే మా లక్ష్యం. యుద్ధం మా లక్ష్యం కాదు.. ఉగ్రవాదులకు బుద్ధి చెప్పడమే మా విధానం.

**కాళ్ల బేరానికి వచ్చిన పాక్..**

మనం చేసిన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మనకు ఫోన్ చేశారు. మాతృభూమి రక్షణలో మన సైనికుల వీరత్వం కనిపిస్తోంది. భుజ్, ఉధంపూర్ స్థావరాలకు వెళ్లి మన సైనికుల సత్తా ప్రత్యక్షంగా చూశా. సైనిక సత్తాను ప్రశ్నించడం విపక్షాలకు సరికాదు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు.




# స్థానిక సంస్థల్లో వైశ్యుల వాటా తేలాల్సిందే

## ఈ డబ్ల్యూ ఎస్‌లో వర్గీకరణ తేవాలి

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, మిర్యాలగూడ:** ఆగస్టు మూడో తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరుతూ మిర్యాలగూడ రైస్ మిల్లర్ల అసోసియేషన్ , ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైశ్య రాజకీయ రణభేరి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైశ్య వికాస వేదిక , వైశ్య రాజకీయ రణభేరి చైర్మన్ డా. కాచం సత్యనారాయణ హాజరై గోడ పత్రికను స్థానిక వైశ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో వైశ్యుల వాటా తేల్చాలన్నారు. ఈ డబ్ల్యూ ఎస్ లో వర్గీకరణ తేవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలి అని అన్నారు. ఈ రణభేరి ద్వారా?? వైశ్యుల ఆత్మగౌరవం హక్కుల సాధనకై వైశ్య రాజకీయ రణభేరి మేమెంతో మాకంత అనే నినాదంతో ముందుకు సాగుతూ వైశ్యుల గొంతును లేవనెత్తాలి. ఆగష్టు మూడవ తేదీన ప్రతి వైశ్యుడు కుటుంబ సభ్యులుతో కలిసి ఈ రణభేరికి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తిరునగరు భార్గవ్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గౌరు శ్రీనివాస్, కర్నాటి రమేష్, సి హెచ్ శ్రీనివాస్, పాండురంగయ్య, జె రాములు, నాగరాజు గుండా, గందె రాము, గుడుగుంట్ల గణేష్, గుడిపాటి నవీన్, గట్టు రమేష్, గౌరు విజయ్ కుమార్ , మా శెట్టి శ్రీనివాస్, విద్యాసాగర్, కర్నాటి శరత్, శిల శ్రీనివాస్, గుంటూరు నాగేశ్వరావు ఆయిల్ శ్రీనివాస్, రేపాల శ్రీనివాస్, రేపాల లక్ష్మీకాంతం,ఇడుకుల శ్రీనివాస్, మైలవరపు మురళి, మిట్టపల్లి విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

### - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మొదటిపేజీ తరువాయి...




విశ్వంభర, హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ..మేజర్ పంచాయతీల వరకే పరిమితమైన మద్యం దుకాణాలను పల్లెలకు విస్తరించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ, అధికారం దక్కించుకున్న తర్వాత ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్నదని ధ్వజమెత్తారు. నాగు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని విమర్శించారు. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు కుట్ర పన్నుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కేసీఆర్ పాలనలో పల్లె, పల్లెకు ప్రగతి రథచక్రాలు. ప్రతి చేనుకు నీళ్లు.. ప్రతి చేతికి పని. ఇంటింటికి తాగునీళ్లు.. ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతిబాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె, పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాలలో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి .. ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్. ఏడాది క్రితం సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ.897. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ.1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, ధరఖాస్తు ధర రూ.3 లక్షలకు పెంచాలని నిర్ణయం. నాడు మద్యం అమ్మకాలపై విమర్శలు, నేడు అధికారం దక్కించుకుని ఆదాయం కోసం మద్యం అమ్మకాలనే నమ్ముకున్న కాంగ్రెస్ సర్కార్. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం. పాలన గాలికి.. ప్రగతి కాటికి' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నాం

### ఎలాంటి ఉత్తమ విధానాలైనా సింగపూర్ నుంచే వస్తున్నాయి
### గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దేందుకే మళ్లీ వచ్చాను
### పెట్టుబడులకు ఇక్కడి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి : ఏపీ సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి...



విశ్వంభర, సింగపూర్: సింగపూర్ ప్రభుత్వంతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సింగపూర్‌లో పర్యటిస్తోన్న ఆయన సోమవారం ఏపీ–సింగపూర్ బిజినెస్ ఫోరంలో పాల్గొని మాట్లాడారు. ఎలాంటి ఉత్తమ విధానాలైనా సింగపూర్ నుంచే వస్తున్నాయని అన్నారు. "స్వాతంత్ర్యం తర్వాత మన నాయకులు మిళిత, సోషలిస్టు ఆర్థిక విధానాలు అవలంబించారు. 1947లోనే ఆర్థిక విధానాల్లో పోటీపడి ఉంటే భారత్ ఇప్పుడు ఎలా ఉండేదో ఆలోచించండి. ఎట్టకేలకు 1991లో ఆర్థిక సంస్కరణల బాట పట్టింది. భారత్ సంస్కరణలు చేపట్టిన 13 ఏళ్లకు చైనా అదే విధానం అవలంబించింది. 2014లో ఏపీ రాజధాని మాస్టర్ ప్లాన్ కోసం ఇక్కడికి వచ్చా. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దేందుకే మళ్లీ వచ్చాను. సింగపూర్‌లో అవినీతి అనేది ఉండదని విన్నాను. నేను తొలిసారి సీఎం అయినప్పుడు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో సింగపూర్ టౌన్‌షిప్ ఏర్పాటు చేయాలని కోరా. ఇప్పుడు ఏపీలో సింగపూర్ మాదిరిగా నగరాన్ని నిర్మించాలని సంకల్పించా. ఉచితంగా రాజధాని మాస్టర్‌ప్లాన్ ఇచ్చేందుకు సింగపూర్ ముందుకు వచ్చింది. అభివృద్ధిలో భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. అదే బాటలో ఏపీ కూడా పయనించాల్సి ఉంది.

పెట్టుబడులకు ఇక్కడి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి. మేం సులభతర వాణిజ్య విధానాలను ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి పెట్టాం. నవంబర్ 14, 15 తేదీల్లో సీఐఐ, ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా సదస్సు నిర్వహించనున్నాయి. దీనికి సింగపూర్ ప్రతినిధులను ఆహ్వానిస్తున్నా"అని చెప్పారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ల సాధనకు కలిసి రావాలి

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ నేతలు శాసనసభలో ఆమోదం తెలిపి.. ఢిల్లీలో అడ్డుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆగస్టు 5,6,7 తేదీల్లో రాష్ట్రపతి అపాయింట్ కోరామని చెప్పారు. వరసగా మూడురోజులపాటు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామని పొన్నం తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోరేవారంతా తమతో కలిసి దిల్లీకి రావాలని పిలుపునిచ్చారు. "గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి.

గత ప్రభుత్వం వాటిని తగ్గించింది. రిజర్వేషన్ల పెంపు బిల్లును మేం మార్చి 30న రాష్ట్రపతికి పంపించాం. 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50శాతం కోటా దాటిపోయింది. ఈడబ్ల్యూఎస్‌కు అడ్డురాని 50శాతం కోటా బీసీల విషయంలో మాత్రమే ఎందుకు అడ్డువస్తుంది? బీసీ రిజర్వేషన్ల సాధనలో అన్ని పార్టీలు కలిసి రావాలని కోరుతున్నాం. సామదానభేదదండోపాయాలు అన్నట్లుగా అన్ని రకాలుగా పోరాడుతాం"అని మంత్రి పొన్నం తెలిపారు.




# స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట

మొదటిపేజీ తరువాయి...



**విశ్వంభర, హైదరాబాద్:** స్థానిక ఎన్నికలు సమీస్తోన్న వేళ బీసీలకు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావుకీలక హామీ ఇచ్చారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తామని మాటిచ్చారు. 45 శాతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని కీలక హామీ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అవగాహన లేదని విమర్శించారు. బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తోందని రాంచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించుకున్నామని.. అందులో భాగంగానే ఆగస్టు 2న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ దగ్గర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో భారీ ధర్నాకు ప్లాన్ చేశామని.. ఈ ధర్నాలో బీసీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. మరోవైపు గ్రామాల్లో గత కొన్ని రోజులుగా స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే వార్డు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు తమ కసరత్తు ప్రారంభించారు. సెప్టెంబర్ లోపు ఎన్నికలు నిర్వహించాని హైకోర్టు తీర్పుతో ఆశావాహుల్లో ఉత్సాహం పెరిగింది. అలాగే ఈ సారి ఎన్నికల్లో పోటీకి యువత ఆసక్తి కనబరుస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ దఫా కొత్త తరం నాయకులు ఎన్నికల్లో నిలబడి గెలిచి తమ రాజకీయ భవిష్యత్‌కు పునాది వేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

## తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగొద్దు.. ఏజీ సుదర్శన్ రెడ్డికి మంత్రి దామోదర విజ్ఞప్తి



విశ్వంభర, హైదరాబాద్: ఏజీ సుదర్శన్ రెడ్డితో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశం ముగిసింది. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా కోర్టులో వాదనలు వినిపించాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డికి ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు లో వాదనల కోసం, అవసరమైతే సీనియర్ న్యాయవాదుల సహకారం తీసుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడేలా, స్థానికులకే మెడికల్ సీట్లు దక్కేలా గతేడాది ప్రభుత్వం జీవో 33 తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు తెలంగాణ స్థానిక కోటాలో తమకు కూడా సీట్లు ఇవ్వాలని ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులు ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కొనసాగుతున్న వాదనలు, ఈ నెల 5న సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నది. ఈ నేపథ్యంలోనే ఏజీని కలిసి, స్థానిక విద్యార్థుల ప్రయోజనాలు కాపాడాలని మంత్రి కోరారు.

## కులాల మధ్య చిచ్చు పెట్టొద్దు
### – మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏపీ ఎంపీ సీఎం రమేశ్ చేసిన ఆరోపణలపై మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు స్పందించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రోకర్ మాటలు మాట్లాడటం ఇకనైనా మానుకోవాలని సీఎం రమేశ్‌కు హితవు పలికారు.
సీఎం రేవంత్ రెడ్డికి కమ్మ సామాజికవర్గం మీద అంత ప్రేమ ఉంటే.. జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్‌లో కమ్మ నేతకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని అన్నారు. బీజేపీలో ఏ స్థాయి నేతను నేరుగా కలిసే స్థాయి కేసీఆర్‌ది.. మధ్యలో సీఎం రమేశ్ పైరవీ ఎందుకని మండిపడ్డారు.
సీనియర్ ఎన్టీఆర్ తర్వాత.. కమ్మ సామాజికవర్గానికి అత్యంత ప్రయారిటీ ఇచ్చింది కేసీఆరే అని అన్నారు. ఓడిపోయి ఇంట్లో ఖాళీగా కూర్చున్న తుమ్మల నాగేశ్వర రావుకు మంత్రి పదవి.. ఆ తర్వాత ఎమ్మెల్సీని చేశారని గుర్తుచేశారు. తుమ్మల, మాగంటి గోపీనాద్, పువ్వాడ అజయ్ ఇలా అనేక మంది కమ్మ నేతలకు కేసీఆర్ చాలా అవకాశాలు ఇచ్చారని అన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా మాట్లాడటం ఇకనైనా సీఎం రమేశ్ మానుకోవాలని సూచించారు.

# జమ్మూకశ్మీర్‌లో ‘ఆపరేషన్ మహాదేవ్’

## ముగ్గురు పహల్గాం ఉగ్రవాదుల హతం..!



విశ్వంభర, నేషనల్ బ్యూరో:
జమ్మూకశ్మీర్‌లో సోమవారం జరిగిన ‘ఆపరేషన్ మహాదేవ్’లో పహల్గాం దాడితో సంబంధం ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను సైనిక దళాలు మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ విషయాన్ని సైన్యం ధ్రువీకరించినట్లు ఆల్–ఇండియా రేడియో తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. మరోవైపు హతమైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు గతేడాది సోనామార్గ్ టన్నెల్‌లో జరిగిన ఉగ్రదాడికి కారకుడు కాగా, మరొకడు పహల్గాం ఉగ్రదాడిలో అనుమానితుడిగా పీటీఐ కథనంలో పేర్కొంది.
హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాల సమాచారంతో నెల రోజులుగా సైన్యం, పోలీసు బలగాలు గాలింపు కొనసాగించాయి. ఈ ఆపరేషన్ కోసం గత కొన్ని రోజులుగా దళాలు పకడ్బందీగా ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దాచిగామ్ అడవుల్లో రెండ్రోజుల క్రితం అనుమానాస్పద కమ్యునికేషన్లను భద్రతా దళాలు పసిగట్టాయి. దీనికి తోడు.. స్థానిక సంచార జాతుల వారు కూడా ఉగ్రవాదుల కదలికలపై భద్రతా దళాలకు సమాచారం అందించారు. సోమవారం చాలా బృందాలను సైన్యం ఆ ప్రదేశాలకు తరలించింది. ఉదయం 11.30 గంటల సమయంలో 24 రాష్ట్రీయ రైఫిల్స్, 4 పారా కమాండోల బృందం ముగ్గురు ఉగ్రవాదులను గుర్తించింది. ముష్కర మూక షాక్ నుంచి కోలుకొనేలోపే శరవేగంగా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది.
ఈ స్థావరంలో మొత్తం ఐదు నుంచి ఏడుగురు ఉగ్రవాదులున్నట్లు సమాచారం. చిక్కటి అరణ్యంలో ఓ గొయ్యి తవ్వి దానిపై టెంట్ వేసుకొని వీరు నక్కారు. ఈ క్రమంలో గాలింపు చేపట్టిన భద్రతా దళాలకు లిడ్వాస్ ప్రాంతంలో తొలిసారి ఉగ్రవాదులు భద్రతా దళాలకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ కూడా ‘ఎక్స్’లో ధ్రువీకరించింది. ఇప్పటికే పహల్గాం ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చిన పర్వేజ్ అహ్మద్ జోథార్, బషీర్ అహ్మద్‌లను గత నెల అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

**ఆపరేషన్‌కు ఈ పేరు ఎందుకు..?**
దాచిగామ్ సమీంలోని మహాదేవ్ పర్వతం ఆధారంగా ఈ ఆపరేషన్‌కు పేరు పెట్టారు. ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రదేశం జబర్వన్–మహాదేవ్ పర్వతాల మధ్య జరుగుతోంది. అందుకే ఈ పేరు పెట్టారు. ఈ ఆపరేషన్‌ను జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా చేపట్టాయి. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది. మృతిచెందిన ముగ్గురూ విదేశీ ఉగ్రవాదులే.. వీరు లష్కరే తయిబాకు చెందినవారు. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ చేపట్టారు. ఘటనాస్థలంలో ఏకే–47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా దళాలను నార్తర్న్ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ అభినందించారు. దళాలు వేగంగా స్పందించి చర్యలు తీసుకొన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడినుంచి పరారయ్యారు. అప్పటినుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ ‘ది రెసిస్టెన్స్ ఫ్రంట్’కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. వీరిలో ఒక్కొక్కరి తలపై రూ.20లక్షల వరకు రివార్డును ఇప్పటికే ప్రకటించారు. ఇటు పార్లమెంటులో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరుగుతుండటం, అదే సమయంలో ఆపరేషన్ మహాదేవ్‌లో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో దీని గురించి గూగుల్‌లో వీటికి సంబంధించిన వార్తలు ట్రెండ్ అవుతున్నాయి.

## తిరుపతి – శిర్డీ మధ్య 18 ప్రత్యేక రైళ్లు..



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి – సాయినగర్ శిర్డీ మధ్య ప్రత్యేక సర్వీసులు నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ రెండు ఆధ్యాత్మిక నగరాల మధ్య 18 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 29వరకు సర్వీసులందిస్తాయని తెలిపింది.

**షెడ్యూల్ ఇదే..**

తిరుపతి – సాయినగర్ శిర్డీ రైలు (07637) తిరుపతిలో ప్రతి ఆదివారం ఉదయాన్నే 4గంటలకు బయల్దేరి మరుసటి రోజు (సోమవారం) ఉదయం10.45 గంటలకు శిర్డీకి చేరుకోనుంది. ఆగస్టు 3నుంచి సెప్టెంబర్ 28వరకు ప్రతి ఆదివారం ఈ రైలు సర్వీసులందిస్తుంది. అలాగే, శిర్డీ– తిరుపతి రైలు (07638) సోమవారం రాత్రి 7.35 గంటలకు బయల్దేరి మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటలకు (తెల్లవారితే బుధవారం) తిరుపతి చేరుకోనుంది. ఈ రైలు సర్వీసులు ఆగస్టు 4నుంచి సెప్టెంబర్ 29వరకు కొనసాగనున్నాయి.

**రైలు ఆగే స్టాప్‌లు..:** ఈ ప్రత్యేక రైళ్లు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి,వికారాబాద్, జహిరాబాద్, బీదర్, భాల్కి, ఉద్గిర్, లాతూర్ రోడ్డు, పర్లి, గంగఖేర్, పర్భని, సేలు, జాల్నా, ఔరంగాబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లలో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉన్నాయి.

## బహావల్‌పుర్ ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తామని ఎవరైనా ఊహించారా?: జై శంకర్



విశ్వంభర, ఢిల్లీ: ‘ఆపరేషన్ సిందూర్’ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశామని విదేశాంగశాఖ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. ఉగ్రవాదాన్ని సహించేది లేదని ప్రపంచమంతా ముక్తకంఠంతో నినదించిన విషయాన్ని గుర్తు చేశారు. ‘ఆపరేషన్ సిందూర్’పై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆయన మాట్లాడారు. భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణను కుదర్చడంలో ట్రంప్ ప్రమేయాన్ని కొట్టిపారేశారు. ఏప్రిల్ 22 నుంచి జూన్ 17 వరకు ప్రధాని మోడీ, ట్రంప్‌ల మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణ జరగలేదని స్పష్టం చేశారు. “ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌లోని బహావల్‌పుర్, మురిద్కేలోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేస్తామని ఎవరైనా ఊహించారా? పాక్ ఎదురుదాడులను సమర్థంగా అడ్డుకున్న తర్వాత.. ఆ దేశం దాడులను నిలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు మాకు ఫోన్లు వచ్చాయి. కానీ.. డీజీఎంవో నుంచి ఈ మేరకు విజ్ఞప్తి రావాలని స్పష్టం చేశాం. పహల్గాం ఉగ్రదాడికి తామే బాధ్యులమని ప్రకటించిన ‘టీఆర్ఎఫ్’ను అమెరికా అంతర్జాతీయ ఉగ్ర సంస్థగా ప్రకటించింది. దీనికి కృషి చేసిన అధికారులకు అభినందనలు. పహల్గాం ఘటనను ఐరాస భద్రతామండలి, క్వాడ్, బ్రిక్స్‌తోపాటు జర్మనీ, ఫ్రాన్స్ వంటి అనేక దేశాలు ఖండించాయి. ఐరాసలోని 193 దేశాల్లో మూడు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉన్నాయి” అని జైశంకర్ తెలిపారు. పాక్, చైనాల పరస్పర సహకారం ఇప్పటిది కాదని.. 60 ఏళ్లుగా కొనసాగుతోందన్న అంశాన్ని ఆయన తెలిపారు. చైనాతో వ్యవహరించాల్సిన తీరుపై ప్రతిపక్షాలు ఉపన్యాసాలు ఇస్తున్నాయని.. కానీ,2జీ,3జీ సాంకేతికతలను ఆదేశం నుంచే తీసుకు న్నాయని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వ హయాంలోనే పాకిస్థాన్ ఎక్కువ కాలం ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో ఉందన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకో, లేదా రహస్య ఒప్పందాలు చేసుకోవడం కోసమో ఇటీవల చైనాకు వెళ్లలేదని, ఉగ్రవాదంపై భారత్ వైఖరిని స్పష్టం చేసేందుకు, ఉద్రిక్తతలను తగ్గించేందుకే వెళ్లినట్లు చెప్పారు.

## ఎంబీబీఎస్ స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు




విశ్వంభర, హైదరాబాద్: ఎంబీబీఎస్ సీట్ల స్థానికతపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివ ర్సిటీ కౌన్సిలింగ్ దరఖాస్తుదారులను స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ఆదేశించింది. తుది తీర్పు వచ్చే వరకు రిజిస్ట్రేషన్ లో చేర్చాలని ఉత్తర్వులు ఇచ్చింది. గత ఏడాది ఇచ్చిన హైకోర్టు ఆర్డర్స్ ఫాలో కావాలని ఆదేశించింది. శాశ్వత నివాసంతోనూ స్థానికత మంజూరు చేయాలని అభిప్రాయపడింది. ఈ తీర్పుతో సుమారు 100 మంది అభ్యర్థులకు తాత్కాలిక ఊరట లభించినట్లయింది. కాగా జులై 15న విడుదలైన ప్రాస్పెక్టస్,నోటిఫికేషన్ పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. నోటిఫికేషన్ లోని రూల్ 3 లో ఏళ్ల చదువు/నివాస నింబంధనపై అభ్యతరాలు వ్యక్తం చేస్తూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

## ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా?..ఈసీకి సుప్రీం ప్రశ్న...



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**
బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. ఆమోదయోగ్యమైన గుర్తింపు పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను మినహాయించాలనే అంశంపై వివాదం కొనసాతున్న విషయం తెలిసిందే. వెరిఫికేషన్ కోసం పరిశీలించాలనుకుంటున్న 11 పత్రాల్లో ఆధార్, ఓటర్ ఐడీ కార్డులను చేర్చకపోవడంపై పలువురు సుప్రీంను ఆశ్రయించారు. బిహార్ ఓటర్ల జాబితా ‘ప్రత్యేక ముమ్మర సవరణ’ (ఎస్ఐఆర్)పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఆధార్‌ను గుర్తింపుకార్డుగా పరిగణించకపోవడంపై ఎన్నికల కమిషన్ ప్రశ్నించింది. ఆధార్‌ను ఓటరు జాబితా గుర్తింపు కోసం ఎందుకు పరిగణించడం లేదని.. ఏ గుర్తింపు కార్డునైనా ఫోర్జరీ చేస్తారు కదా? అని వ్యాఖ్యానించింది. విచారణలో భాగంగా ఎన్నికల సంఘం తరపు న్యాయవాది మాట్లాడుతూ..దేశ పౌరసత్వానికి ఆధార్ రుజువు కాదన్నారు. దేశంలో నకిలీ రేషన్, ఆధార్ కార్డులు సమస్యగా మారాయన్నారు. ఆధార్ కార్డులను ఫోర్జరీ చేస్తుండడం వల్ల కేవలం ఆధార్‌ను పరిగణలోకి తీసుకోవడంపై యోచిస్తున్నట్లు తెలిపారు. అయితే, వెరిఫికేషన్ కోసం ఆధార్‌ను గుర్తింపు రుజువుగా సమర్పించవచ్చని.. దీనిపై ఇప్పటికే రిజిస్ట్రేషన్ ఫారమ్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. దీనిపై స్పందిస్తూ..సుప్రీం పై వ్యాఖ్యలు చేసింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. ఒకవేళ వాటిని పరిగణనలోకి తీసుకోకపోతే అందుకు గల కారణాలను తెలియజేయాలని స్పష్టం చేసింది.

## వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటా..
### – బండి సంజయ్‌కి నితిన్ గడ్కరీ భరోసా



విశ్వంభర, ఢిల్లీ: తెలంగాణలో పలు రోడ్ల విస్తరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నిధులను విడుదల చేయాలని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. సోమవారం న్యూఢిల్లీలో నితిన్ గడ్కరీని కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అందులో భాగంగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. మొత్తం రూ. 113కోట్లతో కూడిన సీఆర్ఐఎఫ్ ప్రతిపాదనలను గడ్కరీకి సమర్పించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేట–ఖాజీపూర్ రోడ్డులో భాగంగా మానేరు నదిపై హై లెవల్ బ్రిడ్జ్ నిర్మాణంతోపాటు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి%–%పోతూర్ రోడ్డు విస్తరణ పనులు వీటిలో ఉన్నాయి. దీంతోపాటు చందుర్తి నుండి మోత్కురావుపేట వరకు (కిమీ 5/0 నుండి 8/450 వరకు) వంతెనల నిర్మాణ పనుల ప్రతిపాదనలు ఉన్నాయి. అట్లాగే కిస్టంపల్లి వరకు రోడ్డుపై వంతెన నిర్మాణ పనులు, శంకరపట్నం మండలంలోని అర్కాండ్ల (గ్రామం) నుండి కన్నాపూర్ (గ్రామం) వరకు వరద కాలువపై హై లెవల్ బ్రిడ్జ నిర్మాణ ప్రతిపాదనలు సైతం వీటిలో ఉన్నాయి. దీంతోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేశారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ త్వరలోనే తెలంగాణకు సీఆర్ఐఎఫ్ నిధులు విడుదలపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్–జగిత్యాల విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు.
గత ఎన్నికలకు ముందే కరీంనగర్ నుండి జగిత్యాల వరకు 4 లేన్ విస్తరణ కోసం కేంద్రం రూ. 2151 కోట్ల 35 లక్షల నిధులతో ప్రతిపాదనలు రూపొందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయా ప్రతిపాదనలకు ఆమోదం పొందడంతోపాటు టెండర్ ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చి నెలలు దాటుతున్నా నేటికీ టెండర్ ప్రక్రియ ప్రారంభం కాని విషయాన్ని గడ్కరీ ద్రుష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారులను పిలిపించిన గడ్కరీ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అభ్యంతరాలు, న్యాయపరమైన అడ్డంకుల నేపథ్యంలోనే కరీంనగర్– జగిత్యాల రోడ్డు విస్తరణ పనులకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ప్రస్తుతం ఆయా అడ్డంకులన్నీ అధిగమించి నివేదికను కమిటీకి పంపించామని తెలిపారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసి అతి త్వరలోనే విస్తరణ పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై మానవహక్కుల కమిషన్ ఆగ్రహం




విశ్వంభర, హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంపై తెలంగాణ మానవహక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లోని వార్తల ఆధారంగా ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. సరోగసీ చిన్నారుల విక్రయాన్ని తీవ్రంగా పరిగణించాలన్న ఎస్‌హెచ్‌ఆర్సీ.. దీనిపై విచారణ జరిపి ఆగస్టు 28లోగా నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్యశాఖకు ఆదేశాలు జారీ చేసింది. సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్, సరోగసీతో పిల్లల్లేని కొరత తీర్చుతామంటూ శిశు విక్రయాలు సాగిస్తున్న సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రంపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు.

# చిరస్మరణీయుడు సినారె

## నేడు ఆయన జయంతి



తెలుగు సాహిత్యంలో శిఖరమంత స్థాయికి ఎదిగిన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిని తెలంగాణ గడ్డ మాత్రమే కాదు, యావత్ తెలుగు ప్రపంచం ఎల్లకాలం గుర్తు పెట్టుకునే మహనీయుడు. సాహితీ వినీలాకాశంలో ధ్రువతారగా వెలుగొందిన సినారె గొప్ప కవిగా, సాహితీవేత్త గా, అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, పరిపాలనాధ్యక్షుడిగా,సినీ గేయ రచయితగా రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన తెలుగు వారి గుండెల్లో పదిలమైన స్థానాన్ని ఏర్పర్చుకుని ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. నడిచే పుస్తకంగా ప్రపంచ ప్రసిద్ధి పొంది చదువుల తల్లి సరస్వతీ మాత ముద్దుల తనయుడుగా పేరు ప్రఖ్యాతులు పొందినాడు.

సింగిరెడ్డి నారాయణరెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని (రాజన్న సిరిసిల్ల) వేములవాడ సమీపంలోని హనుమాజీపేటలో బుచ్చమ్మ, మల్లారెడ్డి పుణ్య దంపతులకు జూలై 29, 1931 లో జన్మించినాడు. రైతు కుటుంబంలో పుట్టిన నారాయణ రెడ్డి చిన్ననాటి నుండే జానపద పాటల పై, హరి కథల పై బాగా శ్రద్ధ పెట్టి వినేవాడు. జంగాల కథలు వైపు కూడా ఆకర్షితుడయ్యాడు. హైస్కూల్ విద్య నభ్యసించే రోజుల్లో గురువు గారైన శేషాద్రి రమణ జంట కవుల ప్రభావం ఇతనిపై పడింది. యతి ప్రాసలు తెలియకుండానే సీస పద్యాలు అలవోకగా రాసేవాడు. ఆనాడు ఉర్దూ మాధ్యమంలోనే సిరిసిల్లలో మాధ్యమిక విద్యను, కరీంనగర్ లో ఉన్నత విద్యను, ఆ తర్వాత హైదరాబాద్ లోని చాదర్ ఘాట్ లో ఇంటర్ విద్యను, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి ఏ డిగ్రీని ఉర్దూలోనే అభ్యసించాడు. అటు పిమ్మట ఉస్మానియాలోనే ఎమ్మే తెలుగు డాక్టరేటు డిగ్రీ పొందాడు. ఆ తర్వాత సినారె సికింద్రాబాదు లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో, నిజాం కళాశాలలో అధ్యాపకుడిగా ఉద్యోగం చేశాడు. తదుపరి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా ఉద్యోగ విధులు నిర్వహించడమైనది. 1981లో అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, 1985 లో అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా, 1989 లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా పని చేశారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక వ్యవహారాల సలహా దారుగా, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షుడిగా ఎంతో కాలం పని చేసారు. 1997 లో భారత రాష్ట్రపతి చే రాజ్యసభ సభ్యుడిగా నియమించబడి తన సేవలను అందించారు.

తెలంగాణ పల్లె వాతావరణం సినారె లో కవితా రంగం పట్ల అభిరుచిని కలిగించింది. విశాలాంధ్రను సమర్థించిన ప్పటికీ, తెలంగాణ పట్ల ప్రత్యేక అభిమానాన్ని వదులుకోలేదు. తెలుగు, ఉర్దూ, ఆంగ్లము, సంస్కృత భాషలలో మంచి ప్రావీణ్యం పొందారు. సంప్రదాయ సాహిత్యాన్ని వంటబట్టించుకున్నప్పటికీ, తన కవిత్వాన్ని ఆధునిక పోకడలతో ఉరకలు వేయించారు. భిన్న సాహిత్య ప్రక్రియలతో అక్షర సేద్యం చేసి సాహితీ పంట పండించారు. సినారె తెలుగు తోటలో గజల్ పూలు పూయించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆయన ప్రధానంగా కవి అయినప్పటికీ, అనేక కవితలతో పాటు, పద్య గద్య కావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రా కథనాలు, బుర్రకథలు, గజల్స్, వ్యాసాలు వంటి విభిన్న సాహిత్య ప్రక్రియల్లో ఆయన రచనలు చేశారు. ఆయన రాసిన అనేక గ్రంథాలు హిందీ, ఇంగ్లీషు, సంస్కృతము, మలయాళం మొదలగు ఇతర భాషలలోకి అనువాదాలు అయ్యాయి. 1953లో తాను రచించిన "నవ్వని పువ్వు" తొలి రూపకాన్ని రాశాడు. ఇక అప్పటినుండి తన సాహితీ ప్రస్థానాన్ని ఆపకుండా కొనసాగించారు. అజంతా సుందరి, జలపాతం, మంటలూ మానవుడు, ఉదయం నా హృదయం, మార్పు నా తీర్పు, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వంభర వంటి అనేక కావ్యాలు, గ్రంథాలు రాయడం జరిగింది. 1988లో సింగిరెడ్డి నారాయణ రెడ్డి రచించిన "విశ్వంభర" కావ్యానికి దేశంలో ఇచ్చే అత్యున్నతమైన "జ్ఞానపీఠ" పురస్కారం లభించింది. తెలుగు భాషలో ఈ ఘనత అందుకున్న మొదటి వ్యక్తి విశ్వనాథ సత్యనారాయణ కాగా, రెండో వ్యక్తి సినారె. ఆచార్య ఎన్.గోపి మాటల్లో చెప్పాలంటే "విశ్వంభర అంటే భూమి ప్రపంచం అని అర్థాలున్నాయి. అది భూగోళం అనే మట్టి ముద్దను గురించిన కావ్యం మాత్రమే కాదు. ఆ మట్టిలో పుట్టిన మనిషి అనే ప్రాణి పొందిన వికారాన్ని గురించి, వికాసాన్ని గురించి ఆ వికాస క్రమంలో ఆ మనిషి చైతన్య స్థాయి గురించి, ఈ చైతన్యానికి మూలమైన మట్టితో తన సంబంధాన్ని గురించిన మట్టే విశ్వంభర... విశ్వంభరే మానవుడు... అంటాడు". ఇదో సుదీర్ఘ కావ్యం. పౌరాణిక చారిత్రక ఘట్టాలు ధ్వనింపజేసే కావ్యం. జ్ఞానపీఠ అవార్డు సాధించిపెట్టిన విశ్వంభర మహాకావ్యము వలె సినారె కూడా విశ్వమానవుడు . మానవీయతే ఆయన దృక్పథం. తెలంగాణ మాగాణం లో విరబూసిన సాహితీ కుసుమము సినారె సినీవినీలాకాశంలో కూడా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర పొందాడు. 1962లో గులేబకావళి చిత్రానికి" నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని" అనే పాటతో సినీగేయ రచయితగా అరంగేట్రంచేశాడు. దాదాపు మూడు వేలకు పైగా సినిమాలకు పాటలు అందించి పాటలు రారాజుగా కీర్తి గడించాడు. 2009లో వచ్చిన అరుంధతి చిత్రంలో జేజమ్మ జేజమ్మ అని మకుటం కలిగిన పాట సినారె చివరి పాట. సినిమా పాటలు అనేకం రాసినా, ప్రతి పాటా దేనికదే సాటిగా నిలుస్తుంది. నేటి పాటల కన్నా సాహిత్యపు సొబగులతో కూడిన సినారె పాటలను ఇప్పటికి ఇష్టపడేవారు కోకొల్లలు.

సినారె కవిత్వంలోనే కాదు.. నిజ జీవితంలో కూడా నిత్య యాత్రికుడే. ఆయన అమెరికా, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయిలాండ్, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి మొదలగు అనేక దేశాలలో పర్యటించారు. అంతర్జాతీయ సమావేశాలలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబింప చేసారు. సినారె అందించిన విశిష్ట సేవలకు గాను ఆయనకు అనేక జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. 1973లో సాహిత్య అకాడమీ అవార్డు, 1977 లో పద్మశ్రీ, 1988లో జ్ఞానపీఠ్ అవార్డు, 1992లో పద్మభూషణ్ అవార్డుతోపాటు, రాజలక్ష్మీ పురస్కారం, సోవియట్ నెహ్రూ పురస్కారం లభించాయి. ఆయన తెలుగు సాహిత్యానికి స్వేదం ధారపోశాడు. రాశిలోనూ వాసిలోనూ మన్నికైన సాహిత్యాన్ని రాశులు పోశాడు. కదిలే ఊహలకు, కన్నులిచ్చిన భావుకుడాయన. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల పైన తనదైన ముద్ర వేశారు. నన్నయ్య నుంచి నారాయణరెడ్డి వరకు అనే ఒరవడికి మైలురాయి అయ్యారు. "మరణం నన్ను వరించి వస్తే ఏమంటాను నేనేమంటాను పాలు పట్టి జోలపాడి పడుకో మంటాను" అంటూ తప్పని మరణాన్ని తాత్వికతతో జోకొట్టిన సాహితీ దురంధరుడు సింగిరెడ్డి నారాయణరెడ్డి. "నా రణం మరణం పైనే" అంటూ చివరి పుస్తకాన్ని ఆవిష్కరించిన అక్షర హాలికుడు ఆయన. సముద్రాల, ఆత్రేయ, గుంటూరు శేషేంద్ర శర్మ, దాశరథి కృష్ణమాచార్య మొదలగు సాహితీ దిగ్గజాల ప్రభావం ఇతనిపై స్పష్టంగా కనిపిస్తుంది. సినారె సమకాలిన ఉద్యమాలకు, తెలంగాణ సిద్ధాంతాలకు అతీతంగా విముఖంగా ఉన్నట్టు కొందరు భావిస్తారు. కానీ ఆయన ఏనాడు సామాజిక భావజాలం పట్ల తటస్థుడు కాదు. తనదైన మానవతా వాదాన్ని ఏనాడు వీడలేదు. ఆయన అజ్ఞేయ వాది. అంటే దేవుడు ఉన్నాడా లేదా అనే విషయంలో ఏది నమ్మలేదు. తెలుగు వారంతా ఒకే రాష్ట్రంగా ఉండాలన్న ఆదర్శ భావన మొదట్లో బాగా ఉండేది. అందుకనే సినారె.. తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది అనే సినీ గీతం కూడా రాశారు. అయితే చివరకు తెలంగాణకు అన్యాయం జరుగుతుందని "తెలుగు జాతి మనది రెండుగా వెలుగు జాతి మనది "అని మార్చి రాసి అంగీకరించారు కూడా. ఎస్ ఆర్ సి లేకుండానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. సినారె తెలంగాణ బిడ్డగా తెలుగు భాషను కాపాడుకుంటూనే, అన్ని ప్రాంతాల వారి అభిమానాన్ని చూరగొన్న మహాకవి. కవికి, సాహిత్యానికి భౌగోళిక సరిహద్దులు ఏనాడు ఉండవని నమ్మిన వ్యక్తి. నిజానికి ఆయన విశ్వమానవుడు. సినారె సాహిత్యం నిత్యం ప్రవహించే మహా జీవనది. తెలుగు సాహితీ ప్రపంచంలో సినారె చిరస్మరణీయుడు.



కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి, నల్గొండ
సెల్ : 9441561655


# కోర్టులు కూడా సర్కారు సంకనెక్కితే ఎలా!?



**ప్రజాస్వామిక వ్యవస్థల్లోని కోర్టులు పౌర హక్కులు, వారి స్వేచ్ఛను విధిగా కాపాడి తీరాలి. పౌరుల స్వేచ్ఛలను హరించేందుకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ చేసే అన్ని ప్రయత్నాలను అడ్డుకోవాలి. కట్టడి చేయాలి. తద్వారా రాజ్యాంగాన్ని, దేశం నిర్మించుకున్న ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడాలి.**

రాజ్యాంగ కోర్టులకు రాజ్యాంగం నిర్దేశించిన కర్తవ్యం అదే. రాజ్యాంగ విరుద్ధమైన శాసనాలను చట్ట సభలు రూపొందిస్తే, నిర్మిస్తే రాజ్యాంగ నియామాలకు సరైన భాష్యం చెప్పి సదరు శాసనాలను రద్దు చేయాలి. ఎంతో ముందు చూపుతో ఆ కర్తవ్య నిర్వహణ కోసమే ఈ దేశ జ్యూడీషియరీని ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలో భాగం కాకుండా చాలా జాగ్రత్తలు తీసుకొని స్వతంత్ర వ్యవస్థగా నిలబెట్టింది ఈ దేశ రాజ్యాంగం.

కానీ బాంబే హై కోర్టు దీనికి పూర్తిగా విరుద్ధమైన ఒక తీర్పును శుక్రవారం నాడు ఇచ్చింది. మనుషులు ఎలా ఆలోచించాలి ?ఏ అంశంపై స్పందించాలి ?ఎందుకు స్పందించాలి స్పందించకూడని అంశం ఏమిటి ? అనే విషయాలపై పౌర సమాజానికి ఆ కోర్టు పాఠాలు చెప్పింది. అదేమిటంటే..ఈ దేశ పార్లమెంటరీ రాజకీయాల్లో దశాబ్దాలుగా కొనసాగుతున్న సీపీఐ(ఎం) అనే రాజకీయ పార్టీ గాజా పాలస్తీనాలో చాలా కాలంగా కొనసాగుతున్న జీనో సైడ్ జాతి హననంపై ఒక నిరసన ప్రదర్శనను నిర్వహించాలని తలపెట్టింది. దానికి అనుమతిని కోరుతూ హై కోర్టుకు దరఖాస్తు చేసింది. దీనిని విచారించిన ఆ కోర్టు ఆ ప్రదర్శనకు వీలు లేదని ప్రకటించింది.వేల కిలోమీటర్ల దూరంలో కొనసాగుతున్న ఆ మానవ హననంపై నిరసన అవసరం లేదని చెప్పింది. నిరసన ప్రదర్శన ద్వారా దేశ విదేశాంగ విధానంతో ఎలా విభేదిస్తారు అని ఒక ప్రశ్నను వేసింది దేశంలో అనేక సమస్యలు ఉన్నాయి కదా, వాటిపై నిరసనలు, ప్రదర్శనలు చేయండి అని ఆ పార్టీకి సూచించింది. అంటే ఏమిటి? దేశ విదేశీ విధానం, నీతిని ప్రశ్నించకూడదని ఆ రాజ్యాంగ కోర్టు చెబుతున్నదనేది తీర్పు సారాంశంగా అర్థమౌతున్నది. అంటే..ప్రభుత్వం ఏమి చెబితే దానికి తలాడించమనే మాట తీర్పులో ధ్వనిస్తున్నది. ప్రభుత్వ విధానంతో విభేదించే స్వేచ్ఛ, హక్కు, అధికారం పౌరులకు లేదనేది ఆ తీర్పు సారాంశంగా కనబడుతున్నది. దశాబ్దాలుగా కొనసాగుతున్న జ్యూడిషియరీ స్వతంత్రాన్ని దెబ్బతీసి దాన్ని సర్కారీ దొడ్డి%ళి%కొలీజియం వ్యవస్థను రద్దుచేసి దాని స్థానంలో జ్యూడీషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ ఏర్పాటు చేసే యత్నం%రి%లో కట్టివేసే అనేక ప్రయత్నాలను మనం చూస్తూనే ఉన్నాం. కొలీజియాన్ని రద్దు చేసే యత్నాలను సుప్రీంకోర్టు అడ్డుకోవడం సర్కారుకు ఆగ్రహం తెప్పించింది.రాజ్యాంగ పెద్దలు, కొందరు మంత్రులు జ్యూడీషియరీపై కొంత కాలంగా చేస్తున్న మాటల దాడితో ఎగ్జిక్యూటివ్, న్యాయ వ్యవస్థల మధ్య అవాంఛనీయమైన ఘర్షణ వాతావరణం ఏర్పడి పెద్ద అగాధానికి దారి తీసింది.చాలా రాజ్యాంగ వ్యవస్థలను నేటి పాలక వ్యవస్థ ఇప్పటికే ధ్వంసం చేసి పడేసింది. పార్లమెంటు సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. జ్యూడీషియరీని కూడా ఎగ్జిక్యూటివ్ లో భాగంగా మార్చివేసి ప్రజాస్వామ్య వ్యవస్థ స్థానంలో నియంతృత్వ వ్యవస్థను స్థాపించే ప్రయత్నాలు తెర వెనక సాగుతున్నాయనే అనేక విశ్లేషణలు స్వతంత్ర మీడియాలో వస్తున్నాయి. బాంబే కోర్టు తీర్పు కూడా తెరవెనక చేసిన ఇలాంటి ప్రయత్నాల్లో ఒక భాగమే అయి ఉండ వచ్చుననే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.




# కన్నవారే..కనిపించే దైవాలు



ప్రస్తుతం మన సమాజ పరిణామం ఏ తీరున సాగుతున్నదీ తెలుసుకోవాలంటే వృద్ధాశ్రమాల పరిమాణం పరిశీలిస్తే స్పష్టమవుతుంది. వృద్ధాశ్రమాల అభివృద్ధి శరవేగంతో సాగిపోతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కూలిపోగానే తల్లిదండ్రులకు అవస్థలు ప్రారంభమయ్యాయి అని చెప్పవచ్చు. తల్లి సర్వ తీర్థ స్వరూపిణిగా పురాణాలు వర్ణిస్తున్నాయి. తల్లిదండ్రులకు ప్రదక్షిణం చేసి గణపతి సత్ఫలితాన్ని, విజయాన్ని పొందాడు. తల్లిదండ్రులకు ప్రణామం చేయడం అనే సదాచారం రామాయణం ద్వారా, భారతం ద్వారా పరివ్యాప్తమయ్యింది. గరుడ పురాణం ప్రకారం తల్లితో సమానమైన గురువు ఎవరు లేరు. అన్ని మత గ్రంథాలు తల్లికి తండ్రికి సర్వాధిక స్థానం ఇచ్చాయి. శరీరం, మనసు, ధనం వీటితో తల్లిదండ్రులను శ్రద్ధాపూర్వకంగా సేవించాలి అని చెబుతున్నాయి.

**తల్లిదండ్రుల సేవతో కలిగే ఫలితాలు..**

పదిమంది ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు. పది మంది ఆచార్యుల కంటే తండ్రి. వెయ్యి మంది తండ్రుల కంటే తల్లి గొప్పది అని మనుస్మృతి చెబుతోంది. తల్లిదండ్రులకు సేవ చేస్తే ఎలాంటి ఫలితాలు కలుగుతాయో శాస్త్రాలు సూచిస్తున్నాయి. పితృ సేవ వల్ల ఈ లోకాన్ని, మాతృ సేవ వల్ల పరలోకాన్ని పొందుతారు. అని భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశించాడు. తల్లిదండ్రుల సేవ సంతానానికి ప్రధాన విధి. అని వాల్మీకి రామాయణం చెబుతోంది. పిల్లల్లో ఉండవలసిన సద్గుణాలను పెద్దలు ముందుగా తాము ఆచరించి చూపించాలి. అనుకరణ వల్ల బాలబాలికలు సదాచారాలను అలవర్చుకుంటారు. ఒక సందర్భంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుడే సీతమ్మ వారితో ఇలా అంటాడు. "తల్లి, తండ్రి, గురువు ఈ ముగ్గురు ప్రత్యక్ష దైవాలు మన ఎదురుగా ఉండే ఈ దైవాలను లెక్కచేయకుండా ఉపేక్షించి మన కంటికి కనిపించని దేవతలను పూజించడం నిరుపయోగం మాతాపితా సేవ వల్ల ధర్మకామాలు సిద్ధిస్తాయి."

**ధర్మవ్యాధుని తల్లిదండ్రుల సేవ..**

తల్లిదండ్రుల సేవ గురించి భారతంలోని ధర్మవ్యాధోపాఖ్యానం మనసులకు హత్తుకునేలా చెప్పింది. చెట్టు కింద కూర్చొని తపస్సు చేసుకునే కౌశికుని పై అదే కొమ్మపై కూర్చున్న కొంగ రెట్ట వేసింది. దాంతో కౌషికుడికి కోపం వచ్చింది. కోపంతో చూడగానే కౌశికుడి చూపుల ధాటికి తట్టుకోలేక ఆ కొంగ బూడిద అయింది. కౌశికుడు గ్రామంలోకి వెళ్లి ఒక ఇంటి ముంగిట ఆగి "భవతీ! భిక్షాందేహీ..!" అన్నాడు భర్త సేవలో ఉన్న ఆ ఇంటి ఇల్లాలు ఆలస్యంగా భిక్ష తెచ్చింది. అందుకు కోపంతో కౌశికుడు ఆమె వైపు చూశాడు.

"నీ కోపం దెబ్బకు కాలిపోవడానికి నేను కొంగను కాదు." అన్నది ఆ ఇల్లాలు. దాంతో కౌశికుడి అహంకారం అణిగింది. తనకు ధర్మం బోధించమని ఆమెను ప్రార్థించగా.. మిథిలా నగరంలో ఉన్న ధర్మవ్యాధుని అడిగి తెలుసుకోమని ఆ ఇల్లాలు చెప్పింది. ధర్మవ్యాధుణ్ణి కలుసుకొని ఆశ్చర్యపోయాడు కౌశికుడు. ధర్మవ్యాధుడు మాంస వ్యాపారి. ఇలాంటి పనిచేసే నీకు ఇంతటి మహత్తు ఎలా వచ్చింది అని ప్రశ్నించాడు కౌశికుడు. తల్లిదండ్రుల సేవ వల్లనే అన్నాడు ధర్మవ్యాధుడు. వృద్ధులైన తల్లిదండ్రులను సేవించకుండా విడిచిపెట్టి తాను తపస్సుకు రావడం ఎంత తప్పో కౌశికుడు గ్రహించాడు. ఈ వృద్ధులే నాకు వేల్పులు. వీరే వేదాలు. వేరే దైవం నాకు తెలియదు. అని ధర్మవ్యాధుడు చెప్పిన మాటలు అందరికీ శిరోధార్యాలు. అంధులైన తల్లిదండ్రులని కావడిలో పెట్టుకొని తీర్థయాత్రలకు బయలుదేరిన శ్రవణ కుమారుడి జీవితమే నాటి రామాయణానికైనా, నేటి భారతీయులకైనా ఒక దివ్య సందేశమని మహర్షి అరవిందుడు తన ఆత్మకథలో తెలిపాడు. గాంధీ మహాత్ముని కూడా శ్రవణ కుమారుని కథ కదిలించింది. అని గాంధీ చరిత్ర చెబుతుంది.

**ఇతిహాసాలు మన కరదీపికలు..**

కృత్రిమ నాగరికత అనే అంధకారంలో పడి దిక్కు మొక్కు తెలియకుండా పయనిస్తున్న నేటి మన యువతకు ఇతిహాసాలు కరదీపికలు కావాలి. భారతంలో 'యక్ష ప్రశ్నలు' వాటికి సమాధానాలు సూటిగా ఉంటాయి. యక్షుడు ధర్మరాజును ప్రశ్నించే ఘట్టంలో "భూమి కంటే ఏది గొప్పది?" అని అడుగుతాడు.

ధర్మరాజు తడుముకోకుండా "తల్లి" అని, జవాబు ఇస్తాడు. ఇంకో ప్రశ్న "ఆకాశం కంటే ఎత్తైనది ఏది?" ఈ ప్రశ్నకు ధర్మరాజు జవాబుగా "తండ్రి" అని, బదులిస్తాడు. ఈ విధంగా మన ఇతిహాసాలు తల్లిదండ్రుల స్థానాన్ని గుర్తు చేస్తున్నాయి. 'మాతృదేవోభవ!' అనే వేదవాక్కు కేవలం నినాదంగా మాత్రమే కాక, మన సమాజంలో ఆచరణలో కనపడాలి. అప్పుడే ప్రయోజనం కలుగుతుంది. నిత్యం పెద్దలకు వృద్ధులకు నమస్కరించి, సేవ చేయడం మానవుడి ఆయుష్షును, విద్యను, కీర్తిని, బలాన్ని, అభివృద్ధి చేస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ దిశలో మనం మన యువతను పయనింప చేయాలి.



"సాహిత్య కళా విభూషణ"
చౌడూరి నరసింహారావు
సాహిత్య, సామాజిక విశ్లేషకులు

# ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్

విశ్వంభర, స్పోర్ట్స్‌: ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్ (19) నిలిచారు. ఆమె తన ప్రత్యర్థి కోనేరు హంపీపై విజయం సాధించారు. ఫైనల్స్‌లో వీరిద్దరి మధ్య జరిగిన తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో దివ్య విజయం సాధించారు. చివరి టైబ్రేకర్‌లో దివ్య తెల్లపావులతో బరిలోకి దిగారు. 2025 ఫిడే మహిళల ప్రపంచ కప్ ఫైనల్స్‌కు చేరిన తొలి క్రీడాకారిణిగా ఆమె నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే టోర్నీలో విజేతగా ఆవిర్భవించిన తొలి క్రీడాకారిణి కూడా ఆమే. ఫైనల్స్‌లో దివ్య 1.5 పాయింట్లు.. కోనేరు హంపి 0.5 సాధించారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో కోనేరు హంపీ తీవ్రమైన పోటీ ఇచ్చారు. దీంతో ఫలితం నేడు టైబ్రేకర్‌కు చేరింది. నిన్న జరిగిన మ్యాచ్‌లో దివ్య కూడా దూకుడుగానే ఆడింది. ఓ దశలో హంపీని ఒత్తిడికి గురి చేసింది. తాజా విజయంతో దివ్య గ్రాండ్ మాస్టర్ హోదాను అందుకొన్నారు. దీంతో భారత్‌లో ఈ హోదా అందుకొన్న 88వ వ్యక్తిగా నిలిచారు. మహిళల ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన దివ్యను మాజీ ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ అభినందిం చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచినందుకు అభినందనలు దివ్య. ఉక్కంఠ భరితమైన పోరు. కోనేరు హంపీ కూడా మంచి ఆటతీరు.. పోరాటస్ఫూర్తిని కనబర్చారు. భారత చదరంగానికి సంబరాలను తెచ్చిన విజయం ఇది.



**నవతరం మొదలు..**

దివ్య దేశ్‌ముఖ్.. హంపీతో పోలిస్తే పెద్దగా అనుభవం లేని క్రీడాకారిణి. నాగపూర్‌కు చెందిన 19 ఏళ్ల దివ్య.. సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువే. ఈ టోర్నీ ఫైనల్స్ ముందు వరకు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా అందుకోలేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందిన ఆమె 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు పసిడి పతకాలు కూడా ఆమె ఖాతాలో ఉన్నాయి. గతేడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్‌ను అందుకుంది. దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపిస్తోంది. తాజాగా ప్రపంచకప్‌లో తనకన్నా మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక (క్వార్టర్‌ఫైనల్), జు జినర్ (ప్రిక్వార్టర్స్)పై నెగ్గడమే ఇందుకు ఉదాహరణ. సెమీస్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ జాగ్‌యిపై గెలవడం ఆమెను మరో మెట్టు ఎక్కించింది. దివ్య దేశ్‌ముఖ్ - కోనేరు హంపి మ్యాచ్ నేపథ్యంలో గత మూడు రోజులుగా వార్తలు గూగుల్ ట్రెండ్స్ ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. ఈ రోజు దివ్య విజేతగా నిలవడంతో ఆమె పేరు, విషయాలు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

## ఇంగ్లాండ్ జట్టు వ్యవహరించిన
# తీరు దారుణం: అశ్విన్

విశ్వంభర, స్పోర్ట్స్‌: జడేజా, సుందర్ సెంచరీలకూ చేరువలో ఉన్న సమయంలో డ్రా కోసం ప్రతిపాదన చేసిన బెన్ స్టోక్స్‌పై రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. ఆ జట్టు వ్యవహరించిన తీరు మరీ దారుణంగా ఉందని వ్యాఖ్యానించాడు. రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ మాత్రం తమ చేతుల్లో లేదని.. కెప్టెన్ వైపు చూపించడం ఇంగ్లాండ్ శిబిరంలో మరింత అసహనం తెప్పించింది. మ్యాచ్ అనంతరమూ దానిని ప్రదర్శించడం వీడియోల్లో వైరల్‌గా మారింది. దీనిపై అశ్విన్ స్పందిస్తూ.. బంతిని బ్రూక్‌కు ఇవ్వడమనేది బెన్ స్టోక్స్ తప్పిదమని ఆక్షేపించాడు. "మీరు ఎప్పుడైనా ద్వంద్వ ప్రమాణాలు అనే పదం విన్నారా? ఇదిగో ఇంగ్లాండ్ వ్యవహరించిన తీరునే అంటారు. కరచాలనం చేసి ఫ్రస్ట్రేషన్‌ను వ్యక్తం చేయడం చూశాం. నువ్వు (స్టోక్స్) కూడా సెంచరీ చేయకుండా ఏడుస్తూ వెళ్లిపోతే సరిపోయేది. తొలి సెషన్ నుంచి అతడు (జడేజా) మీ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఎవరికైతే బంతిని ఇచ్చావో.. వారి బౌలింగ్‌లో పరుగులు రాబట్టాడు. చివరికి డ్రాగా ముగిసింది. చాలా కష్టపడి ఇద్దరు ఆల్‌రౌండర్లు భారత్‌ను కాపాడారు. ఇలాంటి సమయంలో సెంచరీ చేయొద్దు వెళ్లిపోండి అంటే పద్ధతేనా? బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ చేస్తావా? అని అడుగుతావా. బ్రదర్ స్టోక్స్ అక్కడ బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ కాదు. నువ్వు హార్మిసన్ లేదా ఫ్లింటాఫ్‌ను తీసుకొచ్చినా జడ్డూ మాత్రం నో చెప్పడు. కానీ, నువ్వు హ్యారీ బ్రూక్‌కు బంతినిచ్చావు. అది నీ తప్పు. మాది కాదు కదా.." అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. చివరి బంతి వరకూ ఆడాల్సింది.. "త్వరగా ముగిద్దామని ఇంగ్లాండ్ చెప్పిన కారణాలు వారికి బాగుంటాయేమో. కానీ, ఆ ఫ్రస్ట్రేషన్‌ను ప్రదర్శించాల్సిన అవసరం లేదు. సాధారణంగా ఫలితం తేలదని భావిస్తే ఇరు సారథులు నిర్ణయం తీసుకుంటారు. ఇక్కడ బౌలర్లు అలసిపోయి ఉంటారు అని ఒక కారణం కాగా.. ఫలితం ఎలానూ రాదని ఖరారు కావడం రెండో కారణం. కానీ, ఇక్కడ మాత్రం నేను సంతోషంగా లేను కాబట్టి మీరు కూడా ఉండకూడదని అనుకుంటే ఎలా? అందుకే, నేను కనుక భారత జట్టును నడిపించే సారథిని అయి ఉంటే చివరి గంటలోనూ మిగిలిన 15 ఓవర్లూ ఆడేయమని మావాళ్లకు చెప్పేవాడిని. బ్రూక్ లేదా మరెవరైనా సరే బౌలింగ్ వేయచ్చు. సెంచరీలు చేయడానికి సుందర్, జడేజా పూర్తి అర్హులు" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.




## జట్టు ఎంపికలో ఎవరి జోక్యం ఉండొద్దు: గవాస్కర్



విశ్వంభర, స్పోర్ట్స్ : ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో భారత్ తుది జట్టు ఎంపికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా శార్దూల్ ఠాకూర్‌ను తీసుకోవడం, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడంపై క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. బ్యాటింగ్ సామర్థ్యం ఉండే బౌలర్లకు హెడ్ కోచ్ గంభీర్ ప్రాధాన్యత ఇచ్చాడన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీనిపై తాజాగా భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్లేయింగ్ ఎలెవన్‌లో గిల్‌దే తుది నిర్ణయం అయి ఉండకపోవచ్చని తెలిపాడు. తుది జట్టు ఎంపికలో గిలే నిర్ణయం తీసుకోవాలన్నాడు. హెడ్ కోచ్ సహా ఇతరుల జోక్యం ఉండొద్దని గంభీర్‌కు చురకలు అంటించాడు. 'గిల్ కెప్టెన్. ప్రజలు అతని గురించి, అతని కెప్టెన్ గురించి మాట్లాడుకుంటారు. కెప్టెన్ జట్టు అవుతుంది గానీ కోచ్ జట్టు అవదు. జట్టులో శార్దూల్ ఉండాలని గిల్ కోరుకుని ఉండడు. అతను కుల్దీప్ వైపు మొగ్గుచూపి ఉంటాడు. ఇవన్నీ బయటకు రావని నాకు తెలుసు. కానీ, అన్నింటికీ కెప్టెన్‌దే బాధ్యత. ఎందుకంటే జట్టును నడిపించేది అతను.

## పంత్ స్థానంలో టీమ్‌ఇండియాలోకి నారాయణ్ జగదీశన్



విశ్వంభర, స్పోర్ట్స్‌: ఇంగ్లాండ్‌తో జరిగిన నాలుగో టెస్టు తొలి రోజు ఆటలో బ్యాటింగ్ చేస్తూ గాయపడిన రిషబ్ పంత.. వరి (ఐదో) టెస్టుకు దూర మైన సంగతి తెలిసిందే. దీంతో పం త్ స్థానంలోనారాయణ్ జగదీశన్‌ను ఎంపిక చేశారు. తమిళనాడుకు చెం దిన ఈ 29 ఏళ్ల వికెట్ కీపర్ బ్యాటర్ త్వరలో ఇంగ్లాండ్ పయనమై జట్టుతో క లవనున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన నారాయణ్ జగదీశన్ భారత టెస్టు జట్టుకు ఎంపిక కావడం ఇదే తొలిసారి. ఇతనికి ఫస్ట్ క్లాస్‌లో మంచి రికార్డు ఉంది. 2016లో తొలి ఫస్ట్ క్లాస్ ఆడిన జగదీశన్ ఇప్పటివరకు 79 ఇన్నింగ్స్‌ల్లో 47.50 సగటుతో 3,373 రన్స్ చేశాడు. వీటిలో 10 సెంచరీలు, 14 హాఫ్ సెంచరీలున్నాయి.

**జగదీశన్ రికార్డులివీ..**

రంజీ ట్రోఫీలో తమిళనాడు తరఫున వరుసగా రెండు సీజన్లలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు జగదీశన్. 2023-24లో 13 ఇన్నింగ్స్‌లలో 74.18 సగటుతో 816 పరుగులు, 2024-25లో 13 ఇన్నింగ్స్‌లలో 56.16 సగటుతో 674 పరుగులు చేశాడు. 2024-25 సీజన్‌లో చండీగఢ్‌పై 403 బంతుల్లో 23 ఫోర్లు, 5 సిక్సుల సాయంతో 321 పరుగులు చేశాడు. దీంతో డబ్ల్యూవీ రామన్ (313) రికార్డును బ్రేక్ చేశాడు. ఇక, 2022 విజయ్ హజారే ట్రోఫీలో 8 మ్యాచ్‌ల్లో ఏకంగా ఐదు సెంచరీలు చేశాడు. అది కూడా వరుసగా. ఈ క్రమంలో 830 రన్స్‌తో టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

## చెస్ క్వీన్.. దివ్య దేశ్ ముఖ్ గురించి ఈ విషయాలు తెలుసా..?

విశ్వంభర, స్పోర్ట్స్‌: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ 2025 టైటిల్ విజేతగా నిలిచింది భారత్ కు చెందిన 19 ఏళ్ల యువతి దివ్య దేశ్ ముఖ్. జులై 28న కోనేరు హంపితో జరిగిన టై బ్రేకర్ లో విజయం సాధించి.. చెస్ క్వీన్ (%జష్ట్రవం౦ాబవవఅ% 2025)గా నిలిచింది. 2005, డిసెంబర్ 9న మహారాష్ట్రలోని నాగ్ పుర్ లో జితేంద్ర దేశ్ ముఖ్, నమ్రతా దేశ్ ముఖ్ దంపతులకు జన్మించింది దివ్య. తల్లిదండ్రులు వృత్తి రీత్యా డాక్టర్లు. దివ్యకు ఐదేళ్ల వయస్సు నుంచే చెస్ పై ఇంట్రెస్ట్ ఉండటం చూసిన తల్లిదండ్రులు ఆమెకు ఆ ఆటలో శిక్షణ ఇప్పించారు. భవన్స్ భగవాన్ దాస్ పురోహిత్ విద్యామందిర్లో ప్రాథమిక విద్య అభ్యసించింది. దివ్య దేశ్ ముఖ్.. ఏడేళ్ల వయసులోనే తొలి జాతీయ టైటిల్ నెగ్గింది. అలాగే ఒలింపియాడ్ లో మూడుసార్లు గోల్డ్ మెడలిస్ట్ గా నిలిచింది. వరల్డ్ జూనియర్ ఛాంపియన్ షిప్, వరల్డ్ యూత్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్స్ గెలుచుకున్న దివ్య.. 2023లో ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ గా రాణించింది. 2024లో ఫిడే వరల్డ్ అండర్ 20 గర్ల్స్ చెస్ ఛాంపియన్ గా గెలిచి.. ఈ అరుదైన ఘనత సాధించిన నాల్గవ భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఈ ఏడాది వరల్డ్ ర్యాపిడ్ అండ్ బ్లిడ్జ్ టీమ్ చెస్ ఛాంపియన్ షిప్ లో ప్రపంచ నంబర్ 1 క్రీడాకారిణి హోయిఫాన్ పై విజయం సాధించింది. కొత్త కొత్త ప్లేస్ లు చూడటం, సముద్రంలో బోటింగ్ చేయడం దివ్యకు చాలా ఇష్టమట. తన ట్రిప్స్ కు సంబంధించిన వీడియోలను ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంటుంది. అద్దం ముందుండి సెల్ఫీ తీసుకోవడం కూడా ఆమెకున్న హాబీస్ లో ఒకటి. తాను చెస్ క్వీన్ గా ఎదగడానికి కారణం తల్లిదండ్రులేనని దివ్య గర్వంగా చెప్తుంది. చెస్ ప్లేయర్ కాకపోయి ఉండుంటే తన పేరెంట్స్ లాగే డాక్టర్ లేదా.. ఆస్ట్రోనాట్ అయ్యేదాన్ని అని గతంలో కొన్నిసార్లు దివ్య చెప్పుకొచ్చింది. ప్రస్తుతం దేశంలో చెస్ మాస్టర్స్ ర్యాంకింగ్స్ లో సెకండ్ ప్లేస్ లో ఉంది.



## డివిలియర్స్ విధ్వంసం..
# 39 బంతుల్లోనే శతకం

విశ్వంభర, స్పోర్ట్స్ : వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ విధ్వంసం సృష్టించాడు. ఆదివారం ఆస్ట్రేలియా చాంపియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 39 బంతుల్లోనే శతకం బాదాడు. ఏబీడీ మెరుపులతో సౌతాఫ్రికా చాంపియన్స్ 95 పరుగుల తేడాతో ఆసిస్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 241 పరుగులు చేసింది. డివిలియర్స్ కేవలం 46 బంతుల్లోనే 123 రన్స్ చేశాడు. అతనికితోడు స్మట్స్(85) కూడా సత్తాచాటాడు. అనంతరం ఛేదనలో ఆస్ట్రేలియా తేలిపోయింది. 16.4 ఓవర్లలోనే 146 పరుగులకే చేసి ఆలౌటైంది. బెన్ కటింగ్(59 నాటౌట్) ఒక్కటే రాణించగా..మిగతా వారు విఫలమయ్యారు. సౌతాఫ్రికా చాంపియన్స్ కెప్టెన్ ఆరోన్ ఫాంగిసో 4 వికెట్లు, ఇమ్రాన్ తాహిర్ 3 వికెట్లు పడగొట్టి ఆసిస్ పతనాన్ని శాసించారు. టోర్నీలో మూడు సెమీస్ బెర్త్‌లు ఖరారయ్యాయి. సౌతాఫ్రికా, పాకిస్తాన్, ఆస్ట్రేలియా సెమీస్‌కు అర్హత సాధించాయి. మరో బెర్త్ కోసం వెస్టిండీస్, ఇంగ్లాండ్, భారత్ పోటీపడుతున్నాయి.



# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



**విశ్వంభర, ముంబయి:**

దేశీయ మార్కెట్లు సోమవారం నష్టాలను మూటగట్టు కున్నాయి. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, కీలక రంగాల షేర్లలో అమ్మకాలను మార్కెట్లను కుదిపేశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, రియల్టీ రంగ సూచీలు నష్టపోవడం సూచీలను కిందకు పడేసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 570 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,700 మార్క్‌ను కోల్పోయింది. సోమవారం ఉదయం 81,299.97 వద్ద స్వల్ప నష్ట ంతో ప్రారంభమైన సెన్సెక్స్ తొలుత కాస్త కోలుకున్నట్లు కన్పించింది. కానీ, మధ్యాహ్నం తర్వాత మరింత పతనమైన సూచీ.. ఇంట్రాడేలో 80,776 .44 వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 572.07 పాయింట్లు కిందకు వెళ్లి 80,891.02 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 156.10 పాయింట్లు నష్టపోయి 24, 680.90 వద్ద స్థిరపడిం ది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు తగ్గి 86.66గా ముగిసింది.ఫార్మా మినహా అన్ని రంగాల సూచీలు ఒత్తిడికి లోన య్యాయి. రియల్టీ సూచీ ఏకంగా 4 శాతం పతనమైంది. మీడియా సూచీ దాదాపు 3శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, లోహ, టెలికాం రంగ సూచీలు 1-1.5 శాతం మేర పడిపోయాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, హీరో మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్, హిందుస్థాన్ యునిలివ ర్ షేర్లు రాణించగా.. కొటక్ మహీంద్రా బ్యాంక్, విప్రో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఇండస్ ఇండ్‌బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి.

# కృత్రిమ మేధను తేలిగ్గా తీసుకుంటున్నారు



విశ్వంభర, బిజినెస్‌: టెక్ దిగ్గజాలు కృత్రిమమేధ ముప్పును తక్కువ అంచనా వేస్తున్నాయని ఏఐ పితామహుడు జెఫ్రీ హింటన్ వ్యాఖ్యలు చేశారు. ఏఐతో తలెత్తే ప్రమాదాలను టెక్నాలజీ కంపెనీలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు."కీలక శాస్త్రవేత్తలు ఏఐ ముప్పును తక్కువ చేసి చెప్తున్నారని నా అభిప్రాయం. డెమిస్ హస్సాబిస్ (డీప్‌మైండ్ సంస్థ సీఈఓ) వంటివారు ఈ ముప్పును (%ూ×=అంఎం%) అర్థం చేసుకొని, దానిని ఎదుర్కొనేందుకు పనిచేయాలనుకుంటున్నారు. తొలినాళ్లలో ఈ ప్రమాదాన్ని గుర్తించనందుకు చింతిస్తున్నాను" అని అన్నారు. దశాబ్దం పాటు సేవలు అందించి 2023లో హింటన్ గూగుల్‌ను వీడారు. ఏఐని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడానికి గూగుల్ చేస్తోన్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆయన వెళ్లిపోయారని అప్పట్లో కథనాలు వెలువడ్డాయి. అయితే అందులో వాస్తవం లేదని తాజాగా ఆయన వెల్లడించారు. అప్పటికి తన వయసు 75 ఏళ్లని, ఆశించినమేర పనిచేయలేకపోవడం వల్లే ఆ సంస్థను వీడినట్లు చెప్పారు. అయితే ఇప్పుడు తాను ఏఐ ముప్పు గురించి స్వేచ్ఛగా మాట్లాడగలనని వ్యాఖ్యానించారు. ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లో చేసిన కృషికిగానూ హింటన్‌కు 2024లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ వరించింది. ఆ రంగంలో దశాబ్దకాలం పాటు ఆయన చేసిన కృషి ఫలితమే ఇప్పుడు ఏఐ విప్లవానికి దోహదం చేసింది. కృత్రిమ మేధ (%ూ×%) ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దానిపై గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ డెమిస్ హస్సాబిస్ కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని అన్నారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వ్యక్తులకు వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని సూచించారు.

# ఫైనల్ గా అబ్బాస్ కి ఒక గొప్ప ఛాన్స్..!



ఒకప్పుడు తెలుగు తమిళ భాషల్లో ఆడియన్స్ ని అలరించిన అబ్బాస్ ఇప్పుడు పూర్తిగా వెండితెరకు దూరమయ్యాడు. విదేశాల్లో అతనేదో పని చేసుకుంటూ ఉన్నాడని సోషల్ మీడియాలో చెబుతుంటారు. 2015 లో చివరగా పచ్చ కాలం అనే మలయాళం సినిమాలో నటించాడు అబ్బాస్. 1990, 2000ల కాలంలో అబ్బాస్ అంటే ఆడియన్స్ కి ఎంతో ఇష్టం. అతను నటించిన ప్రేమదేశం సినిమా అతనికి చాలా పాపులారిటీ తెచ్చి పెట్టింది. హీరోగా, సపోర్టింగ్ యాక్టర్ గా అబ్బాస్ చాలా సినిమాల్లో నటించారు. ఐతే తెలుగులో చివరగా 2014 లో అలా ఒక్క రోజు సినిమాలో చేశాడు అబ్బాస్. ఆ తర్వాత సినిమాలు చేయలేదు. దాదాపు 11 ఏళ్ల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై కనిపించనున్నాడు అబ్బాస్. రీసెంట్ గా అబ్బాస్ ని ఒక తమిళ సినిమాకు ఓకే చేశారు. జివి ప్రకాష్ లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమాలో అబ్బాస్ నటిస్తున్నాడు. ఈ సినిమాను మరియరాజ డైరెక్ట్ చేస్తుండగా జయవర్ధనన్ నిర్మిస్తున్నారు. గౌరి ప్రియ హీరోయిన్ గా నటిస్తున్న ఈ ఫ్యామిలీ డ్రామాలో అబ్బాస్ కి కూడా ఒక మంచి ఇంపార్టెంట్ రోల్ ఇచ్చినట్టు తెలుస్తుంది. అబ్బాస్ తిరిగి సినిమాల్లోకి రావడం అప్పటి అతని సినిమాలు చూసి ఇష్టపడిన వారిని సర్ ప్రైజ్ చేస్తుంది. అబ్బాస్ రీ ఎంట్రీ అతని కెరీర్ ని మళ్లీ స్ట్రాంగ్ చేస్తుందేమో చూడాలి.

జివి ప్రకాష్ చేస్తున్న సినిమా కాబట్టి ఆ సినిమా తెలుగులో కూడా రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉంది. మరి ఈ సినిమాకు సంబందించిన మిగతా డీటైల్స్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. అబ్బాస్ ని తీసుకోవాలన్న ఆలోచన ఎవరిదో కానీ కొన్నాళ్లుగా అబ్బాస్ గురించి సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. అతను సినిమాలు వదిలేశాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని.. అతన్ని ఎవరు పట్టించుకోవట్లేదని అన్నారు. కానీ తనకు ఒక గుర్తింపు తెచ్చిన సినిమాలే మళ్లీ అతనికి ఒక ఆసరగా నిలబడేలా చేస్తున్నాయి. తప్పకుండా అబ్బాస్ రీ ఎంట్రీ క్లిక్ అయితే అతనికి ఇంకా చాలా అవకాశాలు వచ్చే పాజిబిలిటీ ఉంది. తమిళ్ లో రీ ఎంట్రీ ఇస్తున్నాడంటే తెలుగులో కూడా అతన్ని ఏదో ఒక సినిమాల్లో తీసుకునే ఛాన్స్ లేకపోలేదు.

# వీరమల్లు-2.. సాధ్యమేనా?



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిన్ననే ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది 'హరిహర వీరమల్లు'. కానీ సినిమాకు టాక్ అంత గొప్పగా లేదు. ప్రథమార్ధం వరకు బాగానే అనిపించినా.. తర్వాత సినిమా అంచనాలకు తగ్గట్లు సాగలేదు. సినిమా చివరికి వచ్చేసరికి ప్రేక్షకులను నిరుత్సాహం ఆవహించేసింది. ఏ సినిమాకైనా ప్రథమార్ధం అటు ఇటుగా ఉన్నా.. ద్వితీయార్థం, ముఖ్యంగా ముగింపు బాగుండడం ఎంతో అవసరం. అప్పుడే ప్రేక్షకులకు మంచి అనుభూతి కలుగుతుంది.సినిమా మీద సానుకూల అభిప్రాయం కలుగుతుంది. కానీ ఈ సినిమా విషయంలో అది జరగలేదు. అందుకే ఎక్కువగా నెగెటివ్ టాక్ స్ప్రెడ్ అవుతోంది. క్లైమాక్స్‌లో ఏదో ఊహించుకుంటే అదంతా పక్కన పెట్టి తుపాను నేపథ్యంలో ఏదో యానిమేషన్ వీడియో చేసినట్లు లాగించేశారు. పతాక సన్నివేశాల్లో ఏం కోరుకున్నామో అదంతా 'హరిహర వీరమల్లు' పార్ట్-2 'యుద్ధభూమిలో చూసుకోమని సెలవిచ్చాడు దర్శకుడు జ్యోతికృష్ణ. ఐతే ప్రస్తుత పరిస్థితుల్లో అసలు 'వీరమల్లు-2' సాధ్యమవుతుందా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఎప్పుడైనా సరే.. హిట్ సినిమాలకే సీక్వెల్స్ తయారవుతాయి. రిలీజ్‌కు ముందు, రిలీజ్ టైంలో సీక్వెల్ గురించి ఎంత ఊరించినా.. అంతిమంగా ఫలితాన్ని బట్టే రెండో భాగం తీయగలుగుతారు. తొలి భాగానికి సంతృప్తికర ఫలితం రానపుడు సీక్వెల్ తీయడానికి అడుగు ముందుకు పడదు. ఐతే నిన్నటి ప్రెస్ మీట్లో ఇటు దర్శకుడు జ్యోతికృష్ణ, అటు హీరో పవన్ కళ్యాణ్ 'వీరమల్లు-2' గురించి ప్రస్తావించారు. రెండో భాగానికి సంబంధించి 25-30 శాతం చిత్రీకరణ కూడా పూర్తయినట్లు స్వయంగా పవనే వెల్లడించాడు. ఐతే సీక్వెల్ తీయడం ప్రధానంగా పవన్ చేతుల్లోనే ఉంది. 'వీరమల్లు' పూర్తి చేయడానికి ఆయనెంత ఇబ్బంది పడ్డారో తెలుసు. ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలను ముగించి, ఇక సినిమాలకు స్వస్తి చెప్పే ఆలోచనతో ఉన్నట్లు ఇప్పటిదాకా పవన్ సంకేతాలిస్తూ వచ్చాడు. అలాంటపుడు వీరమల్లు-2 కోసం ఆయన డేట్లు ఇస్తాడా అన్నది ప్రశ్న. దాని మీద రత్నం డబ్బులు పెట్టడానికి సిద్ధమా అన్నది మరో ప్రశ్న. అన్నింటికీ మించి 'వీరమల్లు' అంతిమంగా మంచి ఫలితం అందుకుంటుందా అనే క్వశ్చనూ ఉంది. అన్నీ కుదిరి నిజంగా 'వీరమల్లు-2' సాధ్యమవుతుందా అన్నది సందేహమే.

# ఐశ్వర్య మీనన్.. హీటెక్కించే లుక్స్ తో స్టన్నింగ్ స్టిల్స్!



గ్లామర్ ప్రపంచంలో తనదైన స్థానం ఏర్పర్చుకుంటున్న నటి ఐశ్వర్య మీనన్ మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. తాజాగా ఆమె నీయాన్ పింక్ లెహంగాలో చేసిన ఫోటోషూట్ నెటిజన్లను మంత్రముగ్ధులను చేస్తోంది. బ్రైట్ కలర్ లెహంగా, ఫ్లోరల్ వర్క్‌తో ఉన్న బ్లౌజ్, జ్వెలరీ%ౌ% అన్నీ కలిసినప్పుడు ఐశ్వర్య అందం మరింత మెరిసిపోయింది. తన నడుము, గ్లామర్ యాంగిల్స్‌ను బోల్డ్‌గా ఎలివేట్ చేసిన ఆమె ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐశ్వర్య ఫ్యాషన్ సెలెక్షన్

ఈసారి మరింత స్టైలిష్‌గా నిలిచింది. లైటింగ్, పొజింగ్, మేకప్ అన్నీ కలిసే ఆమె లుక్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కుర్చీలో నిదానంగా కూర్చున్న స్టిల్స్‌లో ఆమె క్యూట్ హావభావాలతో ఆకట్టుకోగా, బయట తీసిన ఫోటోలలో ఆమె కొంటె లుక్స్ తో మరింత అందంగా కనిపించింది. తన ఫోటోషూట్స్‌తో పాటు సినిమాల్లోనూ మంచి గుర్తింపు సంపాదించుకున్న ఐశ్వర్య, కెరీర్ విషయంలో అడుగడుగునా మెరుగైపోతుంది. తమిళంలో 'హిప్పీ', 'తామిళ్ ప్కెలట్', మలయాళంలో 'మన్‌త్రీ', 'బజూక' వంటి చిత్రాలతో పాపులర్ అయ్యింది. తెలుగులో నిఖిల్ సరసన నటించిన 'స్పై' మూవీ ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై మిశ్రమ స్పందన పొందినప్పటికీ, ఐశ్వర్యకి నటిగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ప్రస్తుతం ఆమెకు తెలుగు, తమిళ భాషల్లో మంచి ఆఫర్స్ వస్తున్నాయి. బోల్డ్ లుక్స్, గ్లామర్ ప్రెజెంట్ చేయగల సామర్థ్యం ఉన్న నటి అయిన ఐశ్వర్య, ప్రస్తుతం కంటెంట్ బేస్డ్ పాత్రలవైపు అడుగులు వేస్తోందని టాక్. ఇటీవలి ఫోటోషూట్ చూస్తే ఆమె కొత్తగా ఒక ట్రెండ్ సెట్ చేయబోతుందనే భావన స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి స్టైలిష్ ప్రెజెన్స్‌తో పాటు నటనలో తనదైన ముద్ర వేసే ఐశ్వర్య మీనన్, త్వరలోనే తెలుగులో ఒక మిడ్‌రేంజ్ హీరో సరసన నటించే అవకాశం ఉందని సమాచారం.

# బ్లాక్ డ్రెస్‌లో మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటోషూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసాగుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని 'ఇచట వాహనములు నిలుపరాదు' అనే చిత్రంతో ప్రారంభించారు. ఆ తరువాత 'ఖిలాడి', 'హిట్ 2', 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మిరాయ్ నుండి వైబ్ ఉంది బేబి.. సాంగ్ విడుదల..



'హనుమాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్' ద్వారా మళ్లీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. మరో విశేషం ఏంటంటే .. మంచు మనోజ్ ఇందులో ప్రతినాయకుడిగా ధీటైన పాత్రలో కనిపించనున్నారు. శ్రియ, జయరామ్, జగపతిబాబు వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల కానుంది.

ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా విడుదలైన ఫస్ట్ సాంగ్ ప్రోమో సినిమాకు మరింత హైప్ క్రియేట్ చేసింది. "వైబ్ ఉందిలే బేబీ వైబ్ ఉందిలే ఈ గ్లోబ్‌ను ఊపే వైబ్ ఉందిలే" అంటూ సాగే పాట ఫుల్ ఎనర్జీతో, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. తేజ సజ్జా - రితికా జంటపై ఈ పాటను పోలంకి విజయ్ నృత్య దర్శకత్వంలో చిత్రీకరించారు. పాటకు కృష్ణకాంత్ మాస్టర్‌ఫుల్ లిరిక్స్ అందించగా, మ్యూజిక్ డైరెక్టర్ గౌర హరి తమ మ్యూజిక్ మ్యాజిక్‌ను మళ్లీ చూపించారు. పాటను ఫేమస్ బాలీవుడ్ సింగర్ అర్మాన్ మాలిక్ ఆలపించడంతో, ఈ సాంగ్‌కు పాన్ ఇండియా వైబ్ వచ్చేసింది. ప్రస్తుతం ఈ పాట నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. పాటకి మంచి రెస్పాన్స్ వస్తుంది. మిరాయ్ సినిమాతో తేజ సజ్జా మరోసారి సూపర్ హీరో ఫీల్ కలిగించే కాన్సెప్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నారని టాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. గ్లోబల్ స్కేల్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి వచ్చే ప్రతి అప్డేట్‌కి అభిమానులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. వైవిధ్యమైన కాన్సెప్ట్‌లతో ప్రేక్షకులని అలరిస్తున్న తేజ సజ్జా ఈ చిత్రంతోను మంచి హిట్ కొడతాడని అంటున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com